''కవితలపోటీ అని కనబడితేచాలు కాగితాలు ముందేసుకుని కూర్చుంటారు. వారం రోజులు కష్టపడితే ఓ రెండొందల బహుమతి వస్తుంది. దానిబదులు పిల్లలకి ట్యూషన్లు చెప్పుకుంటే ఉత్తమం అని చెబితే వినరుకదా నామాట. ఇప్పుడింతకీ మా పిన్నింటికి వస్తున్నారా లేదా?'' చిరాగ్గా అడిగింది విశాల నన్ను.

# మూగవోయిన కోయిల

- అల్లూరి గౌరీలక్ష్మి

''నువ్వూ పిల్లలూ వెళ్ళండి విశాలా. నేను రాను. అక్కడ నాకు బోర్‌కొడుతుంది.'' బ్రతిమాలుతున్నట్లుగా అన్నాను. ఆమెకింకా కోపం వచ్చింది. ''వందమంది వస్తున్న ఫంక్షన్‌లో బోర్‌కొడుతుందా? అసలు మీరు ఇతర్లతో కలిసేరకమైతే కదా! వంటిపిల్లి రాకాసిలా కూర్చునుండడం మీకిష్టం. కానివ్వండి. నేనిప్పుడు మీకు వంట చేస్తూ కూర్చోవాలన్నమాట.'' విసుగ్గా అడిగింది.

''వద్దు విశాలా! మీరు బయలుదేరండి. నేను ఆకలయినప్పుడు వంట చేసుకుంటానుకదా! నాకు ఆమాత్రం వంట రాదనుకుంటున్నావా?'' అని నచ్చజెప్పి వాళ్ళను పంపించేసి కాగితాలు ముందేసుకుని కూర్చున్నాను.



ఒక్కొక్క కవితకూ థీమ్ దొరకడం ఎంత కష్టమో! దొరికిన తర్వాత కలుగుతున్న భావాల్ని కాగితం మీద అడ్డదిడ్డంగా పరిచేసి ఆ తర్వాత వాటిని సరైన సైజులో కట్ చేసి ఏర్చి కూర్చి టైటిల్ ఇచ్చేవరకూ ఒక తపస్సులా ఉంటుంది తనకు. కవిత పూర్తయినాక చూడాలి దాని అందం. అప్పుడే పుట్టిన బుజ్జాయిలా అది ఊరిస్తూ ఎంత ముద్దొస్తుందో! ఆకవతను మళ్ళీ మళ్ళీ మనసులో, బైటకీ చదువుకుంటూ ఉంటే ఎంత గర్వంగా ఉంటుందో! ఆ ఆనందం అనుభవిస్తేగానీ తెలీదు.

ఏమిటో! విశాల 'అన్నీ పిచ్చిరాతలు' అనేస్తుంది. ''ఒక్కసారి ఈ కవిత చదవవా ప్లీజ్.'' అంటే బలవంతంగా ముక్కుమూసుకున్నట్టు గడగడా చదివేసి ''వంటింట్లో పొయ్యిమీద కూర'' అంటూ పరుగుతీస్తుంది. తను బహువ్యర్థంగా ''టైటిల్ బావుందా?'' అనడుగుతాడు. అర్జంటుగా తల ఊగించి ''రండి భోజనానికి'' అని లాక్కెళుతుంది. ఆమెకి తన కవితలకంటే ముఖ్యమైన విషయాలు చాలా ఉంటాయి. పక్కింటివాళ్ళ కథలు, సినిమా కథలు, చీరల కథలు. అవయితే చాలా ఉత్సాహంగా మెరిసే కళ్ళతో మాట్లాడుతుంది. బహుశా తన భావుకత్వం ఒక జబ్బేమోనని విశాల భావిస్తుండవచ్చు. జబ్బుల్ని ఎవరన్నా ప్రేమిస్తారా?

''మీ కవిత్వాన్ని నేనెంతగా ప్రేమించానుసర్'' తియ్యని స్వరం మనసులో ప్రతిధ్వనించింది. ఉలిక్కిపడ్డాను. అది సునీత గొంతు.

ఇప్పుడు సునీత నాపక్కనుంటే పిల్లల్ని పంపించి నాదగ్గరే కూర్చుని నేను చెబుతుంటే ఆమె రాసేదికాదూ! ఎక్కడన్నా కవిత సాఫీగా సాగట్లేదనిపిస్తే మళ్ళీ ప్రయత్నించమనేది. ఎక్కడన్నా కఠిన పదం పడితే 'ఇక్కడ మరో నాజూకైన మాట వేద్దాం. డిక్షనరీ చూద్దామా!' అనేదికాదూ! నేను గొప్ప కవిని కాకపోవచ్చు. కాని ఇలా రాయడంలో తనకెంత ఆనందం, ఉత్సాహం ఉందో సునీతకి మాత్రమే తెలుసు. అలా మనసు తెలు

సుకుని ప్రోత్సహించే తోడు దొరకడం ఎంత అదృష్టం: కానీ తనే ఆ తోడు వద్దనుకున్నాడు.

సునీత తలపుకు రాగానే సోఫాలో వెనక్కివాలి కళ్ళు మూసుకున్నాను. పెదాలు చిన్నగా విచ్చుకున్నాయి. చక్కని చిత్రం చూస్తున్నట్టుగా పగటికల.

సునీతా, నేను రంగు రంగుల పూదోటలో కూర్చున్నాం. సునీత లేచి హంసలా కదలి వెళుతూ ''ఇదిగో పాడ్, పేపర్స్, పెన్. నేనలా వెళ్ళి పల్లీలు కొనుక్కుని వస్తాను'' అంటోంది. వెళ్తున్న ఆమెను చూస్తూ తను చటుక్కున రెండులైన్లు రాశాడు. ఆమె పల్లీలతో తిరిగొచ్చింది. ''ఏమిటంతేనా! సరే అయితే, నేనలాపోయి ఫ్రూటీలు తెస్తాను. అప్పటికి రాసెయ్యాలిసుమా!'' అంటూ దూరంగా కనిపిస్తున్న కాంటీన్ వైపు నడిచింది. బిడ్డను బ్రతిమాలి, ముద్దుచేసి పాఠం రాయించే తల్లిలా.

తను నిజంగానే పౌరుషపడి పదిలైన్లు రాసేశాడు ఆమె వచ్చేసరికి. వస్తూనే వెనకనుంచి చూసి బుగ్గమీద ముద్దుపెట్టుకుంది. 'బంగారుకొండ' అంటూ కాగితం తీసుకుని చదవడం మొదలుపెట్టింది. తను తృప్తిగా చూస్తున్నాడామెను. ఆమె కళ్ళలో ఆనందం, పొగడ్త నిండిన మధుర భావంతో సన్నటి నీటిపొర. ప్రశంస నిండిన చూపులు తనపై ప్రసరించింది. వెంటనే తన కళ్ళలో తడి ఊరింది.

నాకలకి స్టాప్ పెట్టి లేచి కాగితం తీసి చకచకా రాయడం మొదలుపెట్టాను. సునీత నాపక్కనే ఉన్నట్టుగా ఇలాంటి పగటికలకంటే నాకు చక్కని ఇన్స్పిరేషన్ వచ్చేస్తుంది. ఈ కలలు నా స్వంతం. ఎలా కావాలంటే అలా, ఎప్పుడంటే అప్పుడు, ఎక్కడంటే అక్కడ వస్తుంటాయి. వెంటనే వెయ్యేనుగుల బలం వస్తుంది నాకు.

ఉత్సాహంగా రెండు గంటలు కష్టపడి పేజీలు నింపి నిద్రపోయాను. లేచేసరికి మూడయ్యింది. బాగా ఆకలేసి వంటిల్లంతా వెతికాను. బిస్కట్లు దొరికాయి. 'అమ్మయ్య' అనుకుంటూ అవి తినేసి టీ చేసుకుని తాగాను. ఆకలి తీరింది. తిరిగి కాగితాలు ముందేసుకుని కూర్చున్నాను.



వాటన్నిటినీ చక్కదిద్ది ఫెయిర్ చేసేసరికి మంచి కవితలు మూడు తయారయ్యాయి. వాటిని తృప్తిగా చదువుకుని గొప్ప రిలీఫ్‌తో పేపరు అందుకున్నాను మనసుకు డైవర్షన్ కోసం.

సాయంత్రానికి విశాలా పిల్లలు వచ్చేశారు. చెప్పులు విడుస్తూనే అడిగింది ''వంట చేసుకున్నారా?'' అని. నా మౌనం చూసి వంటింట్లోకి పోయి చూసింది. ఆమెకు వళ్ళు మండిపోయినట్టుంది. ''ఒక్కపూట వంట చేసుకుంటే ఏమవుతుంది. కుళ్ళుకాకపోతే. ఆ పిచ్చిరాతలు రోజంతా రాసుకోవడానికి తీరికుంటుంది. ఇంక దేనికీ ఉండదు.'' సణుక్కుంటూ గబగబా పట్టుచీర మార్చి వంట చేసేసి వడ్డించింది.

మంచి భార్య. భర్త ఆకలి ఎరిగిన భార్య. అతని శరీరాన్ని జాగ్రత్తగా పోషించే భార్య. కానీ ఆమె తిండి తిన్నారా? అని అడిగినంత ఆత్రంగా 'ఏం రాశారు?' అనడిగుంటే తనకడుపెంత నిండి ఉండేదో కదా! ఆ ఆనందంతో అసలు భోజనమే తినకపోయేవాడేమో!

ఆమె ఫంక్షన్ విశేషాలన్నీ విన్న తరువాత పడుకునే ముందు నేనే మనసుండబట్టలేక అడిగాను. ''నా కవితలు- మూడు రాశాను. ఒకసారి చూడరాదూ.'' అని.

''సరే చదవండి.'' అందామె దుప్పటి మెడవరకూ కప్పుకుంటూ దయ తల్చినట్టుగా. అమాత్రానికే నా మనసు దూదిపింజెలా తేలికపడింది.

హుషారుగా ఈల వేసుకుంటూ కాగితాలు తీసుకొచ్చి పక్కనే కూర్చుని చదవడం మొదలుపెట్టాను. ఆమె 'ఊ' కొడుతోంది. ఒక కవిత పూర్తయ్యింది. అందులో నేను వాడిన పదాల విరుపు గురించి చెప్పాను. అసలా వాక్యంలో అందం ఎలా వచ్చిందో ఆమెకర్థం అయ్యేభాషలో చెప్పాను. ఇలాంటి సందర్భంలోనే దాశరథి ఒక కవిత ఎలా రాశారో వివరంగా చెప్పబోతూ ఆమెవైపు చూశాను. అప్పటికే ఆమె నిద్రపోయి చాలాసేపయినట్లుంది.

చల్లని నీళ్ళు మొహాన కొట్టినట్లయింది. మొహాన్ని అరచేత్తో రుద్దుకుని లైటార్పి పడుకుంటూ 'సునీతా' అనుకున్నాను ఆర్తిగా. ఎంతకీ నిద్రరాలేదు. మనసు గతంలోకి వెళ్ళిపోయింది.

పది సంవత్సరాల క్రితం తనొక పల్లెటూర్లో గవర్నమెంట్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తుండేవాడు. ఒకసారి ప్రముఖ వార పత్రికలో పడిన తన కవితకి ప్రధమ బహుమతి వచ్చింది. పక్కనే పరిచయం, ఫోటో వేయడంతో కాలేజీ అంతా తెలిసింది. స్టూడెంట్స్, కొలీగ్స్ అంతా ఒకటే ప్రశంసించారు. తనకి కాస్త గర్వం కలిగింది ఆనందంతోబాటు.

ఎప్పుడూ కిలకిలా నవ్వుతూ, తుళ్ళుతూ ఉండే సునీత డిగ్రీ ఫైనలియర్ స్టూడెంట్. తెలివైన విద్యార్థి

## గ్లామరులోనే గ్రామరు


ఎన్ని చెప్పండి రమ్యకృష్ణ డీగ్లామరైజ్డ్ కేరక్టర్స్ పెర్ఫా



మెన్స్ కేరక్టర్స్ ఎన్ని చేసినా గ్లామరు పాత్ర చేసినపుడు సంపాదించిన మార్కులూ, సాధించిన అభిమానుల ఆదరణ గ్లిజరిన్ పాత్రల్లో సాధ్యంకాదు.

రమ్యకృష్ణని ఓ అందాల బొమ్మలా రాఘవేంద్రరావు ఎస్టాబ్లిష్ చేశారు. ఆ రూపమే రమ్య అభిమానుల మనోఫలకాల మీద తిష్టవేసుకుంది. ఆయనకిద్దరు, ఆహ్వానం పేరుతో పెర్ఫామెన్స్ చేసి రమ్య రుజువు చేసుకున్నా అసలు అందంగా చూపించని సినిమాలకు రిపీటింగ్ వుండదనిపించింది. ఇటీవల కొన్ని చిత్రాలను స్టడీ చేసి బయ్యర్స్ టాక్, ఇద్దరు మిత్రులు చిత్రం ప్రారంభం సందర్భంగా చిరంజీవి రాఘవేంద్ర రావు రమ్యకృష్ణలు కలయిక సంచలనం సృష్టిస్తోందని, ఆర్టిస్టుల ఇమేజికి తగ్గట్టుగా పాత్రల్ని మలిచి సంచలన విజయం సాధించి చిరంజీవికి పట్టుబట్టి హిట్టు ఇస్తాడని ట్రేడ్ భోగట్టా! గతంలో 'జగదేకవీరుడు అతిలోకసుందరి'ని మించిన హిట్టు ఇస్తాడంటున్నారు. రాఘవేంద్రుడి సొంత బ్యానర్ కదా! చూద్దాం!

– క్రిటిక్




కూడా. ఆరోజు ఫైనలియర్ బియస్సీ వాళ్ళు కెమిస్ట్రీ లాబ్‌లో ప్రాక్టికల్స్ చేస్తున్నారు. తను టేబుల్ దగ్గర కూర్చుని ఏవో రికార్డ్స్ కాబోలు దిద్దుతున్నాడు.

ఇంతలో 'సార్' అన్న పిలుపువిని తలెత్తాను. సునీత! ''మీ కవిత చదివానండీ! సింప్లీ సూపర్బ్! చదువుతున్నంత సేపూ నన్ను నేను మర్చిపోయి ఒక అపురూప భావనా ప్రపంచంలోకి వెళ్ళిపోయానుసర్. కవిత పూర్తయిన తర్వాత ఆకాశం నుంచి కిందపడ్డట్టుగా అనిపించింది. చాలా బాగా రాశారు. మీరింత భావుకులని ఇప్పుడే తెలిసింది. నాకిలాంటి కవిత్వం చాలా ఇష్టం. మీరిలాంటి కవితలింకా రాయాలని నాకోరిక. ఆ కవిత చదివిన దగ్గర్నుండీ నా మనస్సు ఆనందంతో పరవళ్ళు తొక్కుతోంది. నేను అనుకున్న భావాలన్నీ అందులో ఉన్నాయి. అందుకే అంత నచ్చిందనుకుంటాను. నోటికొచ్చేసిందనుకోండి'' అనేసి వెళ్ళిపోయింది నవ్వుతూ.

తనకొక్కసారి నిజంగానే ఆకాశం నుంచి కిందపడినట్లనిపించింది సునీత వెళ్ళిపోగానే. ఎంతోమంది తన కవిత బావుందన్నారు క్యాజువల్‌గా. కానీ ఇంత చక్కగా ఎవరూ వ్యాఖ్యానించలేదు. నాలో ఆనందం అర్ణవమైంది.

తొలిసారి నాకింత మార్దవమైన గుర్తింపు దొరికిందనిపించింది. మనం రాయాలేగానీ మన మది లోలోపలి అంతర్యంలోని భావాల్ని ఒక్కరు కనీసం ఒక్కరైనా అర్థం చేసుకోకుండాపోరు. కళ్ళలో నీళ్ళూరాయి ఆనందంతో.

తరచూ నా కవితలు మాగజైన్లలో వస్తున్నాయి. తను ప్రత్యేకించి వాటిపై అభిప్రాయం సునీతనే అడగడం, ఆమె అంతే అభిమానంతో వాటి గురించి విశ్లేషించడం జరుగుతోంది. ఒక్కోసారి తనకి బహు నాజూగ్గా ఆమె సలహాలనివ్వడం తనకి మరింత ఆనందాన్నే ఇచ్చింది. ఓరోజు ''ఒక ఆదివారం మీ ఇంటికొస్తాను సర్. మీరు రాసిన స్క్రిప్టులన్నీ చదువుతానుసర్.'' అని అభ్యర్థనగా అడిగింది. సరేనన్నాను.

అన్నట్టుగానే వచ్చింది. నేనిచ్చిన ప్రతి చిన్న కాగితమూ ఎంతో అభిమానంగా, ఆప్యాయంగా చదివింది. ఆమె అలా నా అక్షరాలను ప్రేమతో నిమిరినట్టుగా చదవడం నా అంతరంగాన్ని కుదిపేసింది. మొత్తం అన్నీ చదివిన సునీత కూడా నాలాగే హృదయపూర్వకంగా స్పందించింది ఆయా సబ్జక్టుల మీద. ఆశ్చర్యపడింది, పొగిడింది ఆనందంగా. ఒక విధంగా నా భావుకత్వపు ఆకర్షణకి పూర్తిగా లొంగిపోయింది.

నాకు బ్రతుకు ధన్యమయినట్లనిపించింది. బ్రహ్మచారి జీవితంలో కొత్త ఉత్సాహం చోటుచేసుకుంది. సునీత–నా కలలరాణి. ఆమెను చూడగానే అంతులేని ఆనందం, ఉద్వేగం కలుగుతున్నాయి. నన్ను చూసిన సునీత కళ్ళలో మెరుపు– నా సాహిత్య కృషికి మధురమైన గెలుపు.

ఫైనల్ ఎగ్జామ్స్‌కి సునీత చాలా కష్టపడి చదువుతోంది. కొంచెం వీక్‌గా కనిపిస్తోంది. కానీ కళ్ళలో అవే కాంతులు. ఆరోజు ఆఖరి సంవత్సరం వాళ్ళందరికీ ఫేర్‌వెల్ పార్టీ. ఆరోజామె కళ్ళలో ఒక స్థిర నిశ్చయం, వింత తేజస్సూ కనబడుతున్నాయ్. పార్టీ హడావిడిలో ఆమె లాగి విడిచిన బాణంలా తిరుగుతోంది. నా మనసే ఒక తెల్లని కాగితంలా ఆమె కదలిక దానిపై అందమైన కవితలా తోచింది.

పార్టీ పూర్తయింది. అందరూ అందరికీ వీడ్కోలు చెప్పుకుంటున్నారు. నా కళ్ళు సునీత కోసం వెతికాయి. అప్పటివరకూ టెన్షన్ ఫీలవుతున్నట్టుగా ఒక మూల నిలబడిన సునీత నా దగ్గరగా వచ్చి ఒక చిన్న లెటర్ ఇచ్చింది. ఇస్తుంటే ఆమె చేతులు తీసుకుంటుంటే నా చేతులు చిన్నగా కంపించాయి. నేను తలెత్తి ఆమెవైపు చూడబోయాను. ఆమె తలవంచి పారిపోయింది. త్వరత్వరగా రూమ్‌కి వెళ్ళి లెటరు విప్పాను.

డియర్ శేఖర్‌సర్,

మిమ్మల్ని తొలిసారి చూసింది మొదలు మీపై ఏదో తెలీని అభిమానం బాధించింది నన్ను. మీకవితలన్నీ చదివాక నిశ్చయం చేసుకున్నాను మీతో నా జీవితం ముడిపడిపోయింది. నాకిప్పుడు ఇదివరకట్లా ఎమ్మెస్సీ చెయ్యాలనీ, పి.హెచ్.డి. చెయ్యాలనీ లేదు. మిమ్మల్ని పొందితే చాలనిపిస్తోంది. నా గోల్ మీరేసర్! అయ్ లవ్యూసర్! నా ప్రేమను మన్నించగలరు.

ఇట్లు మీ అభిమాని

– సుని –

ఆ లెటర్‌ని ఆనందంగా ఎన్నివందలసార్లు చదివాడో తను. మొదటిసారి చదవగానే తియ్యని అనుభూతి! ఎదలో అలజడి. గాలిలో తేలిపోతున్న భావన! సునీత రూపం ముగ్ధమోహనంగా కళ్ళముందు కదలాడింది. ఎంత ప్లెయిన్‌గా, ఓపెన్‌గా అడిగింది. సిగ్గులు, హొయళ్ళు లేవు. క్లాస్‌లో లెసన్ గురించి అడిగినంత సామాన్యంగా, సుకుమారంగా సూటిగా అడిగింది 'నా ప్రేమను స్వీకరించుమం'టూ.

తన ఊహలకు తగిన అమ్మాయి! తన గోలనంతా అర్థం చేసుకోగల పిల్ల తనే కోరివచ్చింది. అలా ఆ రాత్రంతా చిత్రమైన ఆనందాంబుధిలో మునిగిపోయాడు తను. భోజనం కూడా చెయ్యలేదా రాత్రి. మనసుకు ఒక వింత కాంతి చుట్టుకుంది. తెల్లవారేవరకూ అదే ట్రాన్స్‌లో ఉండిపోయాడు. తయారయ్యి కాలేజీకి బయలుదేరేటప్పుడు కాస్త మెలకువ వచ్చినట్లయ్యింది.

కాలేజీకి వెళ్ళిన తర్వాత ఒక్కసారిగా మత్తు దిగిపోయింది. కలల ప్రపంచం నుండి వాస్తవ ప్రపంచంలోకి విసిరివేయబడ్డట్టుగా వచ్చిపడ్డాను. ప్రాక్టికల్‌గా ఆలోచించడం మొదలుపెట్టాను. ఆమె కులం వేరు. తన

కులం వేరు. పెద్దవాళ్ళు చచ్చినా ఒప్పుకోరు. పైగా ఇది పల్లెటూరు. తనని పిచ్చివేషాలు వెయ్యవద్దని ప్రిన్సిపాల్ చేత వార్నింగ్ ఇప్పించగలరు. సునీతను కూడా బాధపెడతారు. ఇదంతా అల్లరీ, అనర్థం తప్ప ప్రేమ ఫలించే సమస్యేలేదు. పైగా సునీత భవిష్యత్తుపై మచ్చపడుతుంది. ఆమె నెత్తుకుని వెళ్ళిపోయి పెళ్ళి చేసుకుని అనంతర పరిణామాలనెదుర్కునేంత ధైర్యం తనకు లేదు.

కానీ తనకు సునీతపై ఆ భావం కలిగినమాట నిజం. ఆమె తన మనసును తట్టి లేపింది. అపురూప భావనలు కలిగించింది. కానీ ఆమెను అందుకోలేని నిస్సహాయుడు తను. అంత అదృష్టం తలుపు తట్టినా ఆమె చెయ్యందుకునే సాహసికాడు తను. ఆరోజంతా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. నాకు తెలుసు అది పిరికి నిర్ణయమని. కానీ తప్పదు.

రెండు రోజుల తర్వాత ఒకరోజు కాలేజీకొచ్చింది సునీత. ఇంకో వారం రోజుల్లో పరీక్షలు ప్రారంభం కావలసి వుంది. ఆమె వచ్చేసరికి తను ఏదో కవితా సంపుటి పుస్తకం చదువుతున్నాడు. నిజానికి గత రెండు రోజులుగా తను ఏ పనీ మనస్ఫూర్తిగా చెయ్యడంలేదు. నటిస్తున్నాడు. మానసికంగా దివాలా తీసినట్టుగా ఉండిపోయాడు. 'సర్' అన్న సునీత పిలుపుకి ఉలిక్కిపడి తలెత్తాను. కొన్ని సెకన్లవరకూ ఆమెనే చూస్తూ ఉండిపోయి నెమ్మదిగా తల వంచి ఎదురుగా కూర్చోమని సైగ చేశాను. ఆమె నా మొహం చూసి కాస్త చిన్నబోయింది. అయినా ఆతృతగా ఉన్నట్టుగా కుర్చీ చివరగా కూర్చుంది. నేను టేబుల్ క్రిందికి చూస్తూ మొదలుపెట్టాను.

''సునీతా! మీలెటర్ చదివాను. జీవితం అంటే నచ్చిన వ్యక్తిని పెళ్ళి చేసుకోవడం మాత్రమే కాదు. ఇంకా ఎన్నో బాధ్యతలుంటాయి. పెద్దవాళ్ళని కాదని చేసుకునే పెళ్ళి వల్ల సుఖపడేదేమీ ఉండదు. వాస్తవంగా ఆలోచించండి. మీకంటే లోకానుభవం ఉన్నవాడిగా, ఫ్రెండ్‌గా చెబుతున్నాను. మీ వయసులో ఇలాంటి ఆకర్షణలు సహజం. మీరు బ్రిలియంట్ స్టూడెంట్. ఇలాంటి అనుభవాల్ని మీరు జయించి ముందుకు సాగి మీ లక్ష్యాన్ని చేరుకోవాలి. అంటే ఎమ్మెస్సీ చేయడం.''

మాట్లాడడం ఆపి ఆమెవైపు చూశాను. తల వంచి ఉన్నా ఆమె మొహంలో తీవ్రమయిన ఆశాభంగం నాకు స్పష్టంగా కనబడింది. అయినా కొనసాగించాను.

''ఊహలు వేరు. వాస్తవాలు వేరు. నేనేమైనా మిమ్మల్ని బాధపెడితే క్షమించాలి. ట్రైటు అండర్‌స్టాండ్ మై పాయింట్ ఎండ్ విష్యూ ఆల్ ది బెస్ట్!'' అని ముగించాను.

చివ్వున తలెత్తిన ఆమె కళ్ళనిండా నీళ్ళు. ''ఓ.కె. థాంక్యూ సర్.'' అంటూ లేచి వడివడిగా వెళ్ళిపోయింది. అదే ఆఖరిచూపు.

ఆవెళ్ళడం తన జీవితంలో నుంచే శాశ్వతంగా వెళ్ళిపోయింది సునీత. ఆమె జ్ఞాపకం తనకి పది సంవత్సరాల తర్వాత కూడా నిత్యనూతన స్ఫూర్తిగా మిగిలిపోయింది. ఆమె తలపు ఒక గాఢమైన ముద్రలా మనసులో పడి శాశ్వతంగా ఉండిపోయింది. తనకి బాధ కలిగినప్పుడల్లా సునీత ఊహాసుందరిగా మారిపోయి తనని అలరిస్తుంటుంది.

నాకు కవితల పోటీలో ద్వితీయ బహుమతిగా అయిదు వందల రూపాయల చెక్ పోస్ట్‌లో వచ్చింది. ఆఫీస్ నుంచి ఇంటికి రాగానే విశాలకి చెప్పాను. ''అబ్బా! ఎంత మంచి మాట చెప్పారు.'' అని ఆనంద పడింది. ''నాన్నగారికి ప్రైజ్ వచ్చిందర్రా. మీకేం కావాలో చెప్పండి.'' అంటూ పిల్లలకి చెప్పింది. పక్కింటామెకీ, ఎదురింటామెకీ కూడా తెలియజేసింది ఉత్సాహంగా.

విశాల నన్ను ''ఏ సబ్జక్ట్ మీద రాశారు? కాపీ ఉందా? చూపించండి'' అని అడుగుతుందేమో అని ఎదురు చూశాను. కానీ ఆమె ఆమాటే ఎత్తలేదు. ప్రైజ్ సొమ్ముతో ఏం కొనాలా అని ఆలోచనలో పడి సంభాషణ ప్రారంభించబోయింది. నేను మాట్లాడలేదు.

నాకు బహుమతి వచ్చిందని తెలియగానే ఆనందంతో కూడిన దుఃఖం కలిగింది. నా ఆర్తినీ, అంతరం మథనాన్నీ గుర్తించి నాకవితని మెచ్చి బహుమతినిచ్చారు న్యాయనిర్ణేతలు అన్న కృతజ్ఞతతో మనసు వణికింది. అప్పుడు కలిగిన మనోభావాల్ని విశాలకు చెప్పాలనుకున్నాను. ఆమె అవకాశం ఇవ్వలేదు. రాత్రి పడుకునే ముందు చెబుదామనుకున్నాను. నే వెళ్ళేసరికి ఆమె నిద్రపోయింది.

పక్కనే పడుకున్నాను నిశ్శబ్దంగా. కొంతసేపటికి సునీత నా ఊహల్లోకి వచ్చేసింది. కళ్ళు మూసుకుని పడుకున్న నాదగ్గరగా వచ్చి జుట్టులోకి చెయ్యి పోనిచ్చి నుదుటి మీద చిన్నగా ముద్దుపెట్టుకుని 'కంగ్రాట్స్' అంది మంద్రంగా. కళ్ళు తెరిచిన నేను ఆమె ఒడిలో తలపెట్టుకుని పడుకున్నాను. వీపుమీద సునీత చెయ్యి నిమురుతోంది.

''మీరసలు బహుమతి వస్తుందని ఊహించారా?'' అడిగింది సునీత.

''లేదు.'' అన్నాను బుద్ధిగా. ''ఇప్పుడు రాసిందేనా! పాతదా?''

''అయ్యో! పోటీకని ఒకరోజంతా కూర్చుని రాశాను తెలుసా? వీటితోపాటు మరో రెండు కవితలు కూడా రాశాను.''

''మరి టైటిల్ అయిడియా ఎలా వచ్చింది? చాలా బావుంది కదూ. చిగురువేసిన కోయిల!''

''దానికొట్టే శ్రమపడలేదు కానీ రెండు మూడుచోట్ల పదాలు ఖచ్చితంగా పడకపోతే ఎంత గింజుకున్నానో తెలుసా?'' వివరించాను.


## విమాన భాగోతం!

ఆమధ్య అమెరికావారు బి-2 బాంబర్ అనే విమానాన్ని కనిపెట్టారు. ఒక్కొక్క విమానం తయారు చెయ్యడానికి 2 మిలియన్ డాలర్లు ఖర్చు అయింది. కొద్ది రోజుల్లోనే ఆ విమానం లోపం ఒకటి బయట పడింది. ఆ విమానానికి ప్రత్యేకంగా ఒక రంగును పూశారు. ఇందువలన ఈ విమానం రాడార్‌కు కనిపించదు! ఆ పెయింటింగ్‌లో లోపం ఉండడంవలన అదికాస్తా వాన నీటిలో కరిగిపోయింది. అది రాడార్‌కు స్పష్టంగా కనపడడంతో అమెరికా వారు లబోదిబోమన్నారు. అయినా ఖర్చుకు రెట్టింపు ఖర్చు పెట్టి ఆ విమానాలను బాగు చేయించడానికి ప్రయత్నిస్తున్నారు.

## ధూమపానం!

ప్రపంచం మొత్తం మీద చైనా దేశంలో సిగరెట్లు తగలేసేవాళ్లు ఎక్కువమంది ఉన్నారట! ఈమధ్య మధ్యఅమెరికాలోని ఇరువురు యువకులు తమ సిగరెట్ల ప్రదర్శనను చైనాలోని కూడలి ప్రదేశంలో ప్రదర్శించారు. మొదటి యువకుడు ఓవంద సిగరెట్లు అవలీలగా ఊదేశాడు. అతను ఒకేసారి అనేక సిగరెట్లను కాల్చాడు! రెండవ యువకుడు 80 శ్వేత సమిధలను కాల్చాడు! వంద సిగరెట్లను ఊదేసిన యువకుడు కుప్పకూలి మరణించాడు! రెండవ అతను హాస్పిటల్ పాలయ్యాడు.

- కొడిమెల



''నాకయితే రెండుచోట్ల పదాలు బాగా నచ్చాయి.'' చెప్పిందామె.

''కానీ అసలు అందం ఇక్కడుంది చూడు'' చదివి వినిపించాను.

''నిజమేసుమా'' అంది తియ్యగా నవ్వుతూ.

''ఇప్పటికైనా ఒప్పుకుంటావా? నాకూ సత్తా ఉందని'' అన్నాను గారంగా.

''ఎందుకొప్పుకోనమ్మా! అందుకేగా ఇంత ప్రేమిం చింది.'' అంటూ ఆమె మెత్తని చేత్తో నానుదుటిపై రాస్తోంటే నిద్రపట్టేసింది.

తర్వాతి నెలలో బావమరిది గృహప్రవేశానికని హైదరా బాదు వెళ్ళవలసి వచ్చింది ఫామిలీతో సహా. ఫంక్షన్ అయిన మర్నాడుదయమే స్నానం చేసి తయ్యారై బిర్లా మందిర్‌కి బయలుదేరాను. టైమ్ తొమ్మిదయింది. ఎందుకో ఎండ లేదసలు. కొండపైన చల్లగా ప్రశాం తంగా ఉంది. చక్కని గాలి వీస్తోంది. దర్శనం చేసుకుని పక్కనున్న బుక్‌స్టాల్‌వైపు వెళ్ళబోయాను.

''హలో సర్! హౌ ఆర్యూ సర్!'' అన్న ప్రాణప్రదమైన గొంతు విని తత్తరపడ్డాను. వెనక్కి తిరిగాను.

సునీత! నా ఊహాప్రేయసి. పట్టుచీరలో దేవతామూ ర్తిలా ఉంది. ఆమె కళ్ళలో గొప్ప తేజస్సు! మూర్తీభవిం చిన స్త్రీమూర్తిలా ఉంది. సంభ్రమంగా చూస్తూ ఉండి పోయాను నోట మాటరాక.

''బావున్నారా సర్!'' అంది నిండుగా నవ్వుతూ. తల ఊపానో లేదో!

''ఎప్పుడొచ్చారు హైద్రాబాద్? ఫామిలీ ఏదీ?'' అంది ఆప్యాయంగా.

తేరుకుని చెప్పాను వివరాలు. నవ్వుతూ విన్నది.

''మీరేం చేస్తున్నారు?'' అడిగాను అభిమానంగా.

''రెడ్డి కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. ఆయన ఎం.డి. దిల్‌సుక్‌నగర్‌లో నర్సింగ్ హోమ్ కట్టాం'' వివ రంగా చెప్పింది. ఇటు తిరిగిన భర్తను చెయ్యి ఊపి పిలి చింది. అతను హుందాగా నడిచి వచ్చాడు చిరున వ్వుతో.

''మావారు కృష్ణకాంత్. ఈయన మా కెమిస్ట్రీ లెక్చరర్ రాజశేఖర్ అని చెబుతుంటాను'' ఒకరికొకర్ని పరి చయం చేసింది సునీత.

''అవునవును. మిమ్మల్ని బాగా గుర్తు చేసుకుంటుంది మీ స్టూడెంట్. గ్లాడ్ టు మీట్ యూ'' చెయ్యి కలు పుతూ అన్నాడతను.

''హలో బావున్నారా'' అనడిగాను. సమాధానంగా తల ఊపి నవ్వాడు. ''వన్ మినిట్'' అంటూ వెళ్ళిపో యాడతను.

''చెప్పండి. ఎలా ఉన్నారు?'' అంది సునీత ఆత్మీ యంగా. తల ఊగించాను సన్నగా నవ్వుతూ. ఆమెను చూస్తూ ఉంటే ఎంతో ఆనందంగా, మరెంతో ఆహ్లా దంగా ఉంది. మాట్లాడాలనిపించడంలేదు. తనే మాట్లా డటం మొదలుపెట్టింది.

''మీకెన్నోసార్లు లెటరు రాయాలనుకుని రాయలేదు. మీరు నా జీవితాన్ని గొప్ప మలుపు తిప్పారు. ఆరోజు మీరిచ్చిన సలహాతో పట్టుదలతో చదివి ఎమ్సెట్ ఎంట్రెన్స్ రాసి సీటు సంపాదించాను. తర్వాత పి.హెచ్.డి కూడా చేశాను. జాబ్ చేస్తుండగానే కృష్ణకాం త్‌గారిని పెళ్ళి చేసుకున్నాను.

ఈరోజు నేనీ స్థితిలో ఉన్నానంటే కారణం మీరే. నన్ను వెన్నుతట్టి కర్తవ్యం బోధించిన మీకు ఏమిచ్చినా రుణం తీరదు. అంతటి సహాయం చేసిన మీకు సింపుల్‌గా లెటర్ రాయడం భావ్యం కాదనిపించింది. మీరు ఇప్పుడా కాలేజీలో లేరని తెలిసింది. ఎక్కడున్నారో తెలీ లేదు. ఎప్పటికైనా స్వయంగా కలిసినప్పుడే ఈ మాటలు చెప్పాలనుకున్నాను.

ఆ శుభదినం ఇలా వచ్చింది. ఇప్పటికి స్వామి సన్ని ధిలో నాకా అవకాశం దొరికింది. మీరేగనక ఆరోజు నన్నలా గైడ్ చేసి ఉండకపోతే నేనొక గొప్ప ప్రపంచాన్ని మిస్ అయిపోయేదాన్ని. అయామ్ రియల్లీ గ్రేట్‌ఫుల్ టుయూ సర్!'' సునీత కళ్ళలో సన్నటి కన్నీటిపొర. కృత జ్ఞతా సూచకంగా ఆమె గొంతులో చిన్న దుఃఖంతో కూడిన బరువు.

అంతవరకూ ఆమెనే చూస్తూ ఆమె మాటలు మంత్ర ముగ్ధుడిలా వింటున్న నేను ఠక్కున చూపు మరల్చాను. ఆమె కళ్ళలో తిరిగిన నీటికి ప్రతిగా నా కళ్ళలో నిండిన కన్నీళ్ళను దాచడానికి ఇరువురం కొన్ని క్షణాలు నిశ్శ బ్దంగా ఉండిపోయాం పది సంవత్సరాల క్రిందటి రోజుల్ని గుర్తు చేసుకుంటున్నట్టుగా.

ముందుగా ఆమే తేరుకుని ''మీరు మా ఇంటికి తప్ప కుండా రావాలి ఫామిలీని తీసుకుని'' అంది బాగ్‌లోంచి విజిటింగ్ కార్డ్ తీసి ఇస్తూ.

''మరెప్పుడైనా ప్లీజ్'' అన్నాను కార్డ్ తీసుకుంటూ.

ఆమె కళ్ళలో ఒక్కక్షణం ఆశాభంగం. అయితే అందులో బేలతనం లేదు. పరిపూర్ణ వ్యక్తిత్వంతో పరిమ ళిస్తున్న నిండు మహిళ ఆమె ఈనాడు. అందుకే మరు క్షణం తిరిగి మామూలుగా అయ్యాయి ఆమె కళ్ళు. కొన్ని సెకన్లు గడిచాక ''మరి నేను పోయిరానా!'' అంది నెమ్మదిగా.

కలుక్కుమంది నామనసు. ''అప్పుడేనా!'' అన్నాయి నా కళ్ళు. ఆ కళ్ళలో భావం చదివినట్టుగా ఆమె తల వంచుకుంది. కొన్ని క్షణాలు మాటల్లేవు. తర్వాత చిన్నగా ''ఆల్ ది బెస్ట్'' అన్నాను ఆమెను కళ్ళనిం డుగా చూసుకుంటూ.

సునీత భర్త దగ్గరికి వెళ్ళి చెప్పినట్టుంది. ఇద్దరూ అక్కడినుండే చెయ్యి ఊపారు. నేను కూడా ఊపాను.

హైదరాబాదు ప్రయా ణం ముగించుకుని తిరిగి వచ్చేశాము. హైద రాబాదులో నేనేదో పోగొ ట్టుకున్నాననిపిస్తోంది. మనసు వెక్కి వెక్కి చిన్నగా ఏడుస్తున్న భావన. కారణం ఇదమిత్థంగా తెలి యడంలేదు. గుండెలు మోయలేని ఏదో దుఃఖాన్ని మోస్తున్నట్లున్నాయి. నా మనసులోని వింత భావాల్ని విశ్లేషించుకుంటూ బాధకు కారణం వెతుకుతున్నాను నిస్సహాయంగా. హైదరాబాద్‌లో సునీత కనబడింది. అది మంచి సంఘటనేకదా! ''నా చక్కటి భవిష్యత్తుకు దారి చూపిన గైడ్ మీరు'' అని కృతజ్ఞతలు కూడా చెప్పింది కదా! అది నేను గర్వపడవలసిన విషయమే కదా! మరి దిగులెందుకు కలుగుతోంది? ఎంత తరచి ఆలోచించినా అర్థం కావడంలేదు. ఏదో అసంతృప్తి. నా మనసు లోలోపలి పొరల్లో ఏదో పాయింట్ మిస్ అవతు న్నాను. ఆ పాయింట్ కోసమే వెతుకుతున్నాను.

హఠాత్తుగా ఒకరోజు కలత రాత్రిలో ఒక ఆలోచన స్ఫురించింది. 'నాకు సునీత కనబడకపోతే నాకీ బాధ ఉండేది కాదేమో!' అని ఉలిక్కిపడ్డాను. 'అదేమిటి? కనబడడంలో తప్పేమిటి?' అర్థం కాలేదు. నా మూగ మనసు మౌనంగా ఉండిపోయింది.

ఒకప్పుడామె నా ముంగిట్లో పూచిన మొగ్గ. ఇప్పు డామె మరొకరి సిగలో నిండుగా విరిసిన గులాబి. మొగ్గ నాదిగా భావించిన నాకు ఈ పువ్వెందుకో పరాయిదిగా అనిపిస్తోంది. ఇందులో నా మొగ్గ సొగసులు లేవు నిండుగా విరిసిన గంభీరత తప్ప. ఈ పూవులో ఆనాటి సిరిమొగ్గ ఆనవాళ్ళు మచ్చుకైనా లేవు.

ఇంతకాలం నామదిలో సువాసనలు వెదజల్లిన సునీత తలపు ఈ సునీత రాకతో మాయమయ్యింది. ఏదీ! నా ఎదలో ఒదిగిన ఆ ముగ్ధమోహన రూపం! పిచ్చిగా వెతి కాను. కనబడడంలేదు. మళ్ళీ మళ్ళీ ప్రయత్నించాను. అస్సలు రూపమే తోచట్లేదు. జ్ఞాపకాల దొంతర్ల నుండి చిత్రంగా మాయమయిపోయింది. కేవలం రేఖారూపం మాత్రం మిగిలింది.

'నో! అలా కాకూడదు. ఎక్కడ నా సునీత! ఎక్కడ!' వ్యర్థంగా అన్వేషిస్తునే ఉన్నాను. ఫలితం లేదు. అటు తర్వాత అంత దుఃఖంలో కూడా, ఓదార్పు లేపనాన్ని నా గుండెకు రాసి సేద దీర్చే నా కలల దేవత మరి కని పించలేదు. పది సంవత్సరాలుగా నా మనసు తోటలో కమ్మని పాటలు పాడుతూ నన్నలరించిన నా 'ఊహల కోయిల' మూగవోయింది.

★

